# తెనుగు కన్నె

"నిన్నా? - నిన్నేనా?"

"మేలుకునే మాట్లాడు తున్నావా - కలా?"

"ఎందుకూ అంత వేళాకోళం... నీ మాటలన్నీ నిజమని..."

- "నమ్ముతూ, ఆసపడుతూంటే చివరకు ఈలా తేల్చడం భావ్యమూ - ఇది మంచికులంలో పుట్టిన పిల్లల లక్షణమేనా - అనేకాదూ, నీవు సెలవీయబోతున్నది? - ఎన్నాళ్ళనుంచి ఆలోచించావు? - వెన్నెల్లో కూర్చుని పరవశుడవై, మైమరచి, ఈ ధోరణిలోకి దిగుతున్నావా? నిన్నా... పెండ్లిచేసుకోవాలా?... బలే!-"

చెంపమీద లేగులాబీసంజలో రత్నప్రభ విసరిపోతూంది. లీల సగము తయారయిన సన్నజాజిదండను కసరికొట్టి లేచి నిలుచున్నది. మోహన్ కూర్చున్నచోట నుంచి కదలలేదు. నీళ్ళల్లో ప్రతిబింబిస్తూన్న ఆ మనోహర మూర్తిని రెప్పవేయకుండా చూస్తున్నాడు.

లీలాకమలంతో లీల మోహనాన్ని ప్రత్యభిజ్ఞానుణ్ణిగా చేసింది. తపఃసిద్ధుడిలాగా అతడు శాంతంగా ఆమె వైపు చూచాడు. అమృతకరుడితో పంతం వేసుకుని అమృతం కురిపించింది. లీల, చిరునవ్వులో -

"ఎవరు పెట్టారు నీ కరత మంచిపేరు - ఆనందమోహనం - నీకన్న - నీ మనసుకన్న - నీ తెలివికన్న - పేరు - పేరే, చాలా బాగుంది... కదూ?"

మోహనం, ఇంతవరకూ సహజమైన గాంభీర్యాన్ని చిక్కబట్టి పరాజితుడు కాకుండా ఉండాలని యత్నిస్తున్నాడు - ఇక సహించలేక పోయినాడు,

'ఎంత జాలిలేదు? లీలా - నీ మనస్సు దేంతో చేశాడో...'

'ఎవరు?'

'ఆ బ్రహ్మ'

"పోనిద్దు, ఆయనతో మనకేమి - తలా, గడ్డం నెరసిన తాత, ఈ మాదిరే అనుక్షణం తప్పులు చేస్తూంటాడు - అసలు దేనితో చేద్దామనుకున్నాడో... వెన్నతోనా, పాలమీగడతోనా?"

మోహనం లీలను ఎదిరించి మాటలాడలేకపోయినాడు. బాలికలాగా జలజల బాష్పాలు కురిపిస్తూ -

'లీలా! నేనేంజేశాను... ఎందుకూ నామీద నీకింత కోపం?' అన్నాడు గాద్గదికంతో.

లీల మరీ నవ్వడం మొదలుపెట్టింది.

'కోపంకాదూ? - నిన్ను పెండ్లిచేసుకోవాలేం? - ఎంత ఆశ.'

'ఆశపడటం నేర్పింది నీవేకాదూ?'

'ఆఖరికి ఆడదానిలాగా – అంతకన్నా ఎక్కువగా... అం... నాదే పొరపాటు... ఆనందబాష్పాలు తెప్పించుకోమన్నది కూడా నేనే కాదూ?'

మోహనం నిరాశతో, నిట్టూర్పు విడిచాడు. చాలా సేపటి వరకూ మాట్లాడలేదు... ఇద్దరూనూ...

'ఇంతకూ, నిన్ననవలసిందేమీ లేదు. నా విధిని నిందించుకోవాలిగాని – ప్రకృతి ధర్మమే...'

'స్వధర్మాన్ పరిత్యజ్య... నీవు చెప్పదలచుకుందేమో కానిద్దూ!'

'నీవు – నా – దానివి – కావా?...'

'అంటే'

'నన్ను పెండ్లాడి –'

'తమకు జ్ఞానమున్నదా?'

'ఏం'

'ఎన్నిమార్లు చెప్పాలి? – నిన్ను పెండ్లి – చేసుకోను; ముమ్మాటికీ – కావాలంటే ఇంకావిను – త్రికరణ శుద్ధిగా –'

'లీలా! నీవేమంటున్నావో ఆలోచించుకో! నీవు నాతో లేకపోతే, ఎవరికోసం – ఎందుకూ – బ్రదకడం?'

'దేవతార్చన చేయడానికీ – వేదపారాయణకూ'

'అను – నీ యిష్టం వచ్చినన్ని మాటలను – ఇంతకన్నా ఇంకా ఏం చేయగలవూ?–... వెళ్ళిపోతాను – ఎక్కడికో, – ఏ తీర్థానికో – సన్యాసినై పోతాను'

'నిజంగా!'

'బెదిరిస్తే, నీవు మనసు మార్చుకుంటావేమోనని యీవేషం వేశాననుకొంటున్నావు కాబోలు... – ఇక ఎవరికీ కనబడను.'

'కలలో కూడా!–'

'...–నీ వింత పనికిమాలిన...'

మోహనం దూకుడుగా నాలుగడుగులు వేశాడు. లీల అతన్ని ఆపి,

'కోపం వచ్చిందా–నిజంగా – మోహన్' అన్నది అనునయంతో.

'చాలు–నీ మాయలు చాలించు – పొరబడ్డాను, కులస్త్రీలకు...'

లీల మళ్ళా నవ్వింది –

'స్త్రీలు ఎప్పుడూ కులంలోనే ఉండాలా మోహన్; కాస్సేపు తోటలో తిరగకూడదూ?'

'లీలా! నీ నిశ్చయ మేమిటో చెప్పు; ఎందుకు విసిగిస్తావూ?'

'చెప్పినట్లు చేస్తే'

'ఒట్టూ!'

'ఇక్కడ అద్దంలేదు కాబోలు – పోనీలే – ఆ కోనేటిలో నీ ఆకారాన్ని చూసుకో'

మోహన్ అమాయకంగా ఆమె చెప్పినట్లు చేశాడు...

'కనిపించిందా – చాలా బాగుంటావు కాదూ? – పెద్దసైజు వామనావతారానివి–'

మోహన్ మండిపడిపోయినాడు.

'...నా అందం నాదీ – నా ప్రతిజ్ఞ విను – నీకన్న రంభను తెచ్చుకుంటాను.'

లీల విరగబడి నవ్వింది.

'నీ పుణ్యమోయెదిగాని, నెమ్మదిగా మాట్లాడు; దేవలోకంలో చాలామంది ఉన్నారు, పెండ్లి కావలసిన వారు – రంభలాటి యుగాలనాటి పడుచుపిల్లలు. మాటవినగానే తగినవరుడు దొరికాడని కట్టుగట్టుకుని పరుగెత్తుకుని వస్తారు, రంభా, – మేనకా, – తిలోత్తమా... అప్పుడు ఎవర్ని ఏరుకుంటావో – మరచిపోకుండా నన్ను కూడా పిలుస్తావు కాదూ – మీ పెళ్ళికి'

'ఇంతేనా? – కానీ – ఇంతకన్నా ఏం పరాభవం చేస్తావు – చేయగలవు?'

'నీవు మాత్రం ఇంకా తెలివితక్కువగా మాట్లాడగలవు కాదూ?'

'... అవును... నీవన్నమాట నిజమే. నిన్నడగటం తప్పే'

'అలా దోవలోకిరా! పొరబాటుని ఒప్పుకుంటే, ఇంకా మనకి పోట్లాట ఎందుకూ? దా, కూర్చుందాము.'

'ఉహుఁ– నీవు కూర్చుంటే ఎట్లా! – గులాబీ పొదను చాలా పూలున్నాయి. కోసుకురా!'

మోహనం ప్రసన్నుడయినాడు. కోపమంతా మరచిపోయి, లీల చెప్పినపని చేయడానికి వెళ్ళిపోయినాడు.

'... వెన్నెల్లో – ఈలా – ఇక్కడ కూర్చుంటే చాలా బాగుంటుంది కాదూ?'

అన్నది కొంచెం సేపటికి లీల. తెచ్చిన గులాబీలన్నీ దండలో అమరినాయి. మిగిలిన జాజులన్నీ క్రీడా సరసిలో విసిరివేసింది...

'ఇక యింట్లోకి వెళుదామా?'

అంటూ లేచి నిలుచున్నది లీల. మోహనం ఆమెను ప్రాధేయపడి –

'లీలా, నీవు అనుగ్రహిస్తే నేను ధన్యుణ్ణవుతాను' అన్నాడు.

'మళ్ళా మొదలా? ఇందాకనే మరిచిపోయినా వనుకున్నానే'

'ఎలా మరచిపోగలను? – నా జీవన సర్వస్వం అదేకాదూ!'

'తప్పదన్న మాటేనా?'

'నా దృష్ట మేలాగుందో?'

'మోహన్! ఎంత అమాయకుడవోయి! – నే నెన్నిసార్లు చెప్పినా, అర్థంకావడంలేదూ? – పాపం మేనత్త కొడుకువి, నిజంగా నిన్నే పెండ్లి చేసుకోవాలిసిందే – కాని మన ఇద్దరి అంతరం ఆలోచించావూ? – నీవు, ఆ ముద్దొచ్చే పిలకతో – స్నానం, సంధ్యా, జపం, తపం అంటూ ఎప్పుడూ ముక్కు మూసుకుని కూర్చుంటావు. నేనో... నాకు మడీ, ఆచారం లేదు. కాఫీత్రాగి, నేను క్లబ్బుకు వెళదామనుకునే వేళకు నీవు సాయం సంధ్య మొదలు పెడతావు. ఎట్లా మనకు జతకుదిరేది – వేషభాషల్లో...'

'లీలా అందుకోసమేనా, నన్నింత అలయించింది? నీ యిష్టప్రకారమే నేనూ ఉంటాను–స్నానం, సంధ్యా... నీ కోసం అన్నీ మానేస్తాను.'

'వద్దు, మానేస్తే మాత్రం ఏం లాభం? - గంధాక్షతలు చెరిగిపోకుండా సూట్ వేసుకుంటే మాత్రం ఏం ప్రయోజనం? నేను - నిన్ను - పెళ్ళి-చేసుకోను-తెలిసిందా?'

... హృదయవేదనంతా వెల్లడిస్తూ, అవ్యక్తమైన ఆర్తనాదం వెలువడింది - రెండునిమిషాలు ఆమెవంక నిశ్చలంగా చూసి, ఉన్మత్తుడిలాగా అక్కడ నుండి పారిపోయాడు మోహనం... లీల పిలుపునైనా వినిపించుకోలేదు.

☆ ☆ ☆

లీల, డాక్టరు స్వామి శాస్త్రిగారి కుమార్తె. శుద్ధ శ్రోత్రియ కుటుంబానికి చెందినవాడైనా, శాస్త్రిగారు యూరప్ వెళ్ళి వచ్చిన తరువాత ఆచార వ్యవహారాలన్నీ మార్చుకున్నాడు. లీలను కూడా, ఆ మాదిరిగానే తరిఫీదు చేశాడు. స్కూలు ఫైనలు చదువుతుండే రోజుల్లో కూడా గౌనుతోనే కాలేజీకి పోయేది. ఇంటరుప్యాసయి చదువు మానిన తరువాతనే క్రమంగా కోకకట్టుకోవడం అలవాటు చేసుకున్నది.

లీల తల్లి పూర్వకాలం మనిషి. శాస్త్రిగారి ఆటలేమీ ఆమెదగ్గర సాగలేదు. ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఆమెచేత బూటన్నా వేయించలేకపోయినాడు. పాశ్చాత్య స్త్రీల నవనాగరిక విలాసాన్ని గురించి అనుదినమూ లెక్చర్లిచ్చేవాడు - కాని, ఆ యిల్లాలు ఆశ్చర్యపడుతూ, ఆయన చెప్పేవన్నీ కథల్లాగ విని నవ్వి ఊరుకునేది.

భార్యమీద కసితీర్చుకోవాలని, లీలమీద సర్వాధికారమూ తానే వహించి, ఆ అమ్మాయిని పక్కా యూరోపియన్ లాగా తయారుచేశాడు శాస్త్రిగారు. లీల తల్లి, చిన్నతనంగదా, పోనీ అని చూసీచూడనట్లు పోనిచ్చింది కొన్నాళ్ళు. ఆమె సహనాన్నీ, మంచితనాన్నీ వేరే మాదిరిగా అర్థం చేసుకుని తానే గెలిచానని... క్రమంగా బూటు విడవకుండానే లోపలికి రావడం... షర్టు తీయకుండానే భోజనానికి సిద్ధపడటం... భోజనం చేస్తూ ఎడంచెయ్యి ఆసరాచేసుకుని, ఆ అంటుచేత్తోనే పట్టుబట్ట సర్దుకోవడం... ఈలాటి... పనులు మొదలుపెట్టాడు శాస్త్రిగారు. లీలకు, తెలిసీ తెలియనియీడు - అమాయకంగా, తానుకూడా తండ్రిలాగానే, ఆయన చెప్పినట్లుగా - ఆయన్ని చూసి - నడుచుకునేది.

ఉన్నట్లుగా ఉండి - ఏం జరిగిందో తెలియదు - క్రమమంతా తలక్రిందులయింది. వంటయింటి బయల్లో బూటుచప్పుడైనా వినపడేదికాదు.

శాస్త్రిగారు బయటసూటూ, హేటుతో తిరిగినా సావడిలోనే అవన్నీ విడిచి, శుద్ధ శ్రోత్రియవేషంతో లోపలికి వెళ్ళేవాడు. లీలకూడా - సరే తండ్రి ఏం చేస్తే అంతేకాదూ?

అంతవరకే - ఆ తరువాత మళ్ళా ఎవరియిష్టం వారిదీ. పేరంటానికైనా, లీల తల్లితో కాకుండా సైకిలు మీద వెళ్ళేది. శాస్త్రిగారు, క్లబ్బులో వినోదాల్లో మునిగి తేలుతూ కులాసాగా తిరుగుతుండేవాడు. కాని యింట్లో మాత్రం ఆయన పెత్తనం సాగడంలేదు - ఆమె తెలివేమో కాని, కిమ్మనకుండా రెండో కంటికి తెలియకుండా, మొగుణ్ణి మంచిదోవకు తీసుకొనివచ్చింది.

లీల భారత భాగవతాలు తల్లిదగ్గర చదువుకున్నది. కొన్ని భాగాలు ఇంగ్లీషులో, స్కూలులోనూ చదివింది. సుభద్ర పార్థుణ్ణిలాగా తానుకూడా మోహనాన్ని పెండ్లి

చేసుకోవడం ఉత్తమం, సంప్రదాయసిద్ధం అని తెలుసును. శాస్త్రిగారికి కూడా మేనల్లుడిమీద చాలా ప్రేమ. లీల అతన్నే తప్పక వరిస్తుందనీ – వరించాలనీ – ఆయన ఉద్దేశ్యం. కాని ముందుగా తన యభిప్రాయం మాత్రం తెలియనీయకుండా, మోహనం, లీలా మునుపటికన్న ఎక్కువగా కలిసి మెలిసి తిరగడానికి ఏర్పాటు చేశాడు. మోహనం అంటే చాలా యిష్టమే శాస్త్రిగారికి, కాని లీలమీద అంతకన్నా ప్రేమ, వివాహం చేయడమే ఆయన పని, వరించటం లీలవంతే? అతడు మోహనమైనా, తదన్యుడైనా శాస్త్రిగారికి ఒకటే.

లీలకు బంధుప్రేమ ఉన్నది. మోహనం మేనత్త కొడుకుని – చాలా అపేక్షగా చూసేది – చూచాయగా తెలుసునుకూడాను తలిదండ్రుల అభిమతం.

మోహనుడు వట్టి అమాయకుడు. మెడిసిన్ చదువుతూ, సూటు వేసుకోడని తోడివారందరూ గేలిచేస్తే, బిళగోచీ మారిస్తే కులం ఎక్కడ చెడిపోతుందోనని చదువు మానుకుని వచ్చిన ఆచారవంతుడు. చదువుకున్నాడు కాని, పుస్తకాల్లో శృంగారమన్నా ఒంటబట్టలేదు. హావాలు, భావాలు, అవ్యాజప్రేమలూ, అనుభవాలు... అంటే, సరిగా అర్థమన్నా చేసుకోలేని – ఓ మాదిరి ముగ్ధావతారం.

లీలకు ఒక్కొక్కప్పుడు జాలివేసేది – సాధారణంగా మాత్రం నవ్వు వచ్చేది. మోహన్ అమాయకత్వాన్ని చూస్తే సినిమాల్లోను, ఇంగ్లీషు నవలల్లోను చూసి.... అర్థం చేసుకున్న అనుభవాలన్నీ ప్రత్యక్షం చేసుకునేందుకు మోహనం ఏ మాత్రమూ పనికిరాడని తెలుసును. అతని చాదస్తమంతా విడిచి, తనకు నచ్చేలాగా తయారుకావడం, ఓపట్టున సాధ్యంకాదనీ తెలుసును – ఏం చేస్తుంది? – ఎలా ఆతన్ని – పెండ్లి చేసుకుంటుంది?

☆ ☆ ☆

లీలకు మెలుకువ వచ్చింది... కొంచెం సేపటివరకూ తానెక్కడ ఉన్నదీ అర్థం కాలేదు. కాని, చలివేస్తున్న కొద్దీ జరిగినదంతా జ్ఞాపకానికి వచ్చింది.

–మోహనం కోపంతో వెళ్ళిపోయిన తరువాత అలాగే ఆలోచిస్తూ – అతడు పోయినవైపే చూస్తూ నిలుచున్నది. నిరాశతో – ఎంత అమాయకుడైనా – ఏం అఘాయత్యం చేస్తాడో అని అనుకుంటూ, విచారపడి అక్కడే నిద్రపోయింది.

పదిగంటలయింది. మోహనం వెళ్ళేటప్పటికి యింకా ఎనిమిది దాటలేదు... రిష్టువాచి ఆగిపోలేదు, నడుస్తూనే ఉంది – నిజంగానే చాలా ప్రొద్దుపోయింది...

సాయం వేళ, అంత కష్టపడీ, అల్లిన దండ అక్కడనే మరచిపోయి, తల్లి ఏమంటుందో – మోహనం ఏమయినాడో – అని భయపడుతూ, ఇంటివైపు మెల్లిగా నడుస్తూంది లీల, సమీపించగానే, చదువుతూన్న పేపరు అడ్డం తీసి, లేచి కూర్చున్నాడు యీజీ ఛైరులోంచి, శాస్త్రిగారు.

లీల తండ్రివంక చూడకుండా, తలవంచుకుని లోపలికి వెళ్ళింది. తప్పించు కున్నానుగదా అని సంతోషంతో – తల్లి కేంజెప్పాలో అని అధైర్యంతో – నెమ్మదిగానే కాలుసాగిస్తూంది, – హాలు దాటకముందే, శాస్త్రిగారు వెనుకనుండి కేకవేశాడు. తిరిగి వెళ్ళక తప్పిందికాదు.

'లీలా!' అని పలుకరించాడు, ఆయన చాలా వాత్సల్యంతో.

లీల తలవంచుకునె 'ఊఁ' అన్నది చాలా నెమ్మదిగా;

'అమ్మా! ఇలా కూర్చో'

లీల కుర్చీనానుకొని నిలుచునే ఉన్నది.

'మోహనం ఏడీ?'

మేఘాలన్నీ ఒక్కమారు గర్జించినా అంత కలవరపడేదికాదు లీల. శాస్త్రిగారు అంతా కనిపెడుతూనే ఉన్నాడు. వణకిపోయింది - వెక్కి వెక్కి ఏడువ మొదలు పెట్టింది.

శాస్త్రిగారు లీలను దగ్గరకు తీసుకుని, తలనిమురుతూ, 'ఎందుకమ్మా!...' అన్నాడు.

లీల మరీ దుఃఖించింది.

'నాన్నగారూ - నాతప్పు... - మోహనాన్ని...' చెపుదామనుకున్నా ఇక ఆపైన మాట్లాడలేకపోయింది. ఆయన నవ్వి -

'మాతల్లి ఇంతమాత్రానికేనా ఇంతగా విచారించడం! నాకు దివ్యదృష్టి లేదు కాని, నాకంతా తెలుసును.'

'నీవేం చేశావమ్మా... విధివశం'

లీల అప్పటికి దిటవు తెచ్చుకున్నది. గాద్గదికం లేకుండానే -

'కాని నేను చేసింది తప్పుకదా?' అని అడిగింది.

కాదని ఆయన తల ఊగించాడు.

'ఉహు- నేను ఒప్పుకోను-నేను చేసింది తప్పే - తప్పే - ముమ్మాటికీ - ఇక శిక్ష అనుభవించాలి.'

'ఎవరు - నేనే! - నేను జేసిన తప్పెంతో నాకు తెలుసును, వేరే ఇంకొక రెందుకూ?'

'నీవు పొరబడటం లేదూ?... చివరకు మంచిగా తేలగూడదూ?'

'తేలాలి... - తేలుతుంది. అది భగవదధీనం - కాని భవితవ్యాన్ని బట్టి, ప్రస్తుతాన్ని మార్చుకోవడం - మరీ దోషం కాదూ?'

'నీ యిష్టం - తెలియనిదానవు కాదు - నీ తలిదండ్రులకు నీవు తప్ప వేరెవరూ లేరని మాత్రం మరువబోకు-'

'క్షమించండి - మీ కడుపునబుట్టి, మీరు మెచ్చని పనిచేస్తానా!'

ఎంత ధీరుడైనా శాస్త్రిగారు ఒక కన్నీటికి అజ్ఞ పెట్టలేక పోయినాడు. లీలకూడా కళ్ళు తుడుచుకున్నది.

తండ్రి మెడకి చేతులు పెనవేసి, ఆయన కళ్ళల్లోకి చూస్తూ -

'మీరా - మీరు నమ్ముతారనేకాదూ, నాకు ధైర్యం. మీ దగ్గర చనువు చేతనే చెప్పాను - అమ్మతో...'

- అమ్మాయీ! భోజనం, చేయవమ్మా? - ఇందాక చూస్తే నిద్రబోతున్నావు. లేపడం ఎందుకని వచ్చేశాను. ఆకలివేయడం లేదు?

లీల తల్లి అక్కడకు వచ్చి దగ్గరగా నిలువబడినది - లీల తల యెత్తలేదు. తల్లికి మారుచెప్పలేదు.

శాస్త్రిగారు బిగ్గరగా నవ్వాడు. లీల తలయెత్తి చూసేటప్పటికి, ఆమెతల్లి కూడా, సాకూతంగా నవ్వుతూ ఉంది.

ఒకర్ని చూసి ఒకరు నవ్వుకున్నారు. లీల తన తల్లిదండ్రులకు అంతా తెలిసే తన్ను అంతసేపటినుంచీ ఆడించారని - అప్పటికి తెలుసుకుంది. - ఇక సంతోషంగా కలతదీరి - నవ్వింది.

'పో... మ్మ. ఇక వెళ్ళి భోజనంచేయి' - అన్నాడాయన.

తల్లి, చేయిబట్టుకుని లీలను లోపలికి తీసుకుని వెళ్ళింది - కొంతదూరం వెళ్ళి, తిరిగి పరుగెత్తుకుని వచ్చి -

"మోహనం ఏడీ?" అని అడిగింది తండ్రిని లీల. ఆయన పరధ్యానంగా -

'మోహనం వస్తాడు...' అని పేపరు చదువుకుంటున్నాడు, ఆమె వంక చూడకుండానే.

'ఎప్పుడు?'

'చదువు అయిపోయిన తరువాత.' లీల ఆ రాత్రి భోజనం చేసిందో లేదో, ఆయన కనుక్కోలేదు.

☆ ☆ ☆

'లీలా!'

మోహనం దిగ్భ్రమజెంది అలాగే చూస్తూ నిలబడిపోయాడు. గుమ్మందాటి అడుగు లోపల వేయలేకపోయినాడు. తనకళ్ళనే తాను నమ్మలేకుండా విస్మయపడుతూ నిలుచున్నాడు.

లీల, లోపల మడిగట్టుకుని దేవీపూజ చేసుకుంటున్నది!

అప్పటికి ఎన్నాళ్ళో అయింది, మోహనం లీలను చూసి, ఖండాంతరాల్లో పెద్దడిగ్రీలు సంపాదించి, జైత్రయాత్ర చాలించుకుని, స్వరాజ్యోన్ముఖుడయే వీరుడిలాగా ఏకధాటిని యింటికి వచ్చేశాడు.

వస్తున్నానని తెలియజేయనన్నా లేదు. ఒక్కసారిగా వచ్చి పడి లీలను మెరిపించాలని అతని అభిప్రాయం.

హాలులోనే యెదురైనాడు శాస్త్రిగారు. ఆయన ఆశ్చర్యాన్ని లెక్కసేయకుండా ఆయనమాట వినిపించుకోకుండా లీలను వెదుక్కుంటూ లోపలికి వచ్చాడు.

జయించాలని - జయించగలననే అనుకున్నాడు. పరాజిత అయిన లీలను సమాశ్వసించి, వీరధర్మం నెరపి ఆమెను అనుగ్రహించాలనుకున్నాడు. తానే గెలిచానని ఆమెకు నచ్చచెప్పాలనుకున్నాడు. కాని -

కలలోనైనా తలచలేదు - లీల - లీల ఈ మాదిరిగా మారిపోయినది.

అదొక వేషమేమో!

ఆ ఆలోచనతో కొంత ఆందోళన తగ్గింది. పరాజయాన్ని అంగీకరించకుండా -

'లీలా-' అని నవ్వుతూ పలుకరించి, ముందుకు ఒక అడుగు వేశాడు. ఆమె మాటాడలేదు - ఆ చూపులోనే - ఆ చూపుతోనే ఆజ్ఞాపించింది. తపస్విలోకం పొలిమేరమీద నిలుచున్న కళోపాసకుడిలాగా - తాను చేరరాని - చేరలేని - తావు అని తెలుసుకుని తలవంచుకుని వెనుకకు తగ్గిపోయినాడు.

సాయంకాలము కిరణావళి, అంతఃపురాంగనల సాయం నేపథ్య విలాసాన్ని దర్శిస్తూ, విడిచి రాలేక సౌధోపరిభాగాలమీదనే విహరిస్తోంది.

అబ్జినీ బాంధవుడు, అపరగిరిమీద జవరాలి వద్దకు జేరుకున్నాడు. సాంధ్యరాగ సంపదలు క్రమంగా తరిగి పోతున్నాయి. బాష్పకలుషితమైన లీల వదన కమలాన్ని సంజకెంగాలులు సరిజేసినాయి. పశ్చాత్తాప హృదయ, ఆమెతన్ను తాను నిందించుకుంటూ –

మోహనం కౌగిలిలో జిక్కింది.

ఆమె గమనించ లేదు. ఎక్కడ నుండి వచ్చాడో – ఏమనుకున్నాడో – అయినా – అయినదానికి వగచి మాత్రం ప్రయోజనమేముందీ; ఇక –

జాజిపొదకు క్రిందుగా పచ్చని పట్టుమీద కూర్చున్నారు. వనదేవత లాశీర్వదించి, సుమవర్షం కురిపించారు.

'లీలా!–'

మాటలాడకుండా, ప్రేమ వెల్లివిరుస్తూన్న కళ్ళతో మోహనాన్ని కరువుదీరా చూసింది.

పరిష్వంగం దృఢం చేశాడు మోహనం. ఆ కుసుమ సుకుమారి...

'లీలా, నేను ధన్యుణ్ణేనా?'

లీలకు ఎందుచేతనో అర్థం కాలేదు.

'నేనే ఓడిపోయాను. నీ విద్యలోనే నిన్ను జయించాలని, దేశదేశాలూ తిరిగి అక్కడి మంచి చెడ్డలన్నీ, అభ్యించుకుని వచ్చాను. కాని నీవేగెలిచావు, నేను... నీ'

'నా బందీవి... అంతేకాదూ మోహనం?'

అన్నది లీల కిలకిలా నవ్వుతూ.

ఆతడు తలవంచుకున్నాడు.

'నిన్ను దయదలచి విడిచిపెడుతున్నాను – ఇక నీవు స్వేచ్ఛగా పోవచ్చును' అన్నది చక్రవర్తి ఠీవితో.

మోహనం లీల యెదుట మోకరించి,

'మహారాజ్ఞిని నేనొకటి వేడవచ్చునా' – అని అడిగాడు దీనంగా.

లీల తల ఊపింది.

మోహనం, ఆ తరువాత నడిపించలేకపోయినాడు. లీల అదంతా కనిపెడుతూనే ఉంది. కాని అతన్ని అలయించడానికి, ఆ ముద్ర విడువకుండా అలాగే నిలుచుని ఉంది – వసంత లక్ష్మిలాగా –

'లీలా – నన్ను – నీవు...'

తడబడుతూ, అంతవరకే అనగలిగాడు మోహనం – ఆమీద ఏమన్నా ఒకటి, రెండు మాటలు వచ్చినా అవి లీల నవ్వులో మునిగిపోయినాయి.

'ఇప్పటికి తెలిసింది మోహనం – కొన్ని సంస్కారాలు జన్మతో అబ్బాలిసిందేకాని, అలవరచుకుంటే వచ్చేవికావు – వృథాగా ఇన్నాళ్ళు గడచిపోయినాయే, ఈపాటికి మనకు సగం కాలం జరిగిపోయేదే, దాంపత్యంలో – సుఖంగా –'

'లీలా...'

మోహనం ఉత్సాహానికి అంతులేదు. ఆమె ఏమి చెపుతూన్నదో, తా నేమంటున్నాడో కూడా తెలియదు - తెలుసుకునే స్థితిలోలేడు.

లీల అతన్ని వారించింది.

'అవును మోహనం - నాదేలోపం, ఆలోచించలేదు.

నేనప్పుడు - నీకు కావలసిన చదువేమో, నీకూ, నీ ఉపాధ్యాయులకి కూడా తెలియదు - నేను ఊరుకున్నాను తెలిసినదాన్ని; నీవు...పాపం'

'నీ వనేదేమీ అర్థం కావటం లేదు లీలా!'

'ఓ - అవును - మరచిపోయినాను - నీకు తెలిసేటట్టు చెప్పనా మోహనం! - నేను నిన్ను పెండ్లి చేసుకుంటాను.'

'లీలా!'

'నేను ఓడిపోయినాను! నీ స్వభావమంతే'

'ఏమిటి?'

'వేదాలూ, ఋషులూ పుట్టినప్పుడు పుట్టాల్సిన వాడవు. నిజంగా ఇంత అమాయకుడివా నీవు మోహనం. నీ చేత ననిపించలేకపోయినాను కదా?'

'ఏమని?'

'ఏమని అయితే నేం? నీ కర్థం కాదుగదా'

'నీవు చెప్పగలవు కాదూ - నేను - నీ,'

'అంతే - నీవు నా భర్తవు - నా నాథుడవు - నా పతివి - నా కాంతుడవు... నన్ను పెండ్లి ఆడుతావు... కాని ప్రేమ అంటే ఏమిటో తెలుసునా? - ఎన్నడయినా విన్నావా మోహనం.'

'అంతేనా...'

'నన్ను ప్రేమించానని - ఎన్నడైనా అన్నావేమో తలుచుకో! - పెండ్లి చేసేవారు పెద్దలు - ప్రేమించుకునేది మనం - - ఈ మాత్రం తెలియకపోతే ఏలా?'

'ఈ మాత్రానికేనా, నన్ను దేశాలన్నీ తిప్పింది. నా ప్రేమ మాటల్లో తెలియజెప్పడానికి వీలులేనిది - అనుభవం నీవే తెలుసుకుంటావనుకున్నాను. ఇదా నా అపరాధం - లీలా - లీ-లా...'

'అబ్బ:... అది అమాయకత్వమే నిజంగా! ఇది అపరాధం కాదు - గడుసుదనం.'

*[కృష్ణా: 8, నవంబరు 31]*

★ ★ ★